సీజనల్‌ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మండల విద్యాధికారి శంకర్‌ రాథోడ్‌

అత్తాపూర్‌: హైదర్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు నిర్మల జ్యోతి, అత్తాపూర్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతలతో కలిసి ఆరోగ్య సమస్యలపై తెలంగాణ విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌ మండల విద్యాధికారి శంకర్‌ రాథోడ్‌ మాట్లాడుతూ.. సీజనల్‌ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. అంటూ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

తెలుగు గెస్ట్‌ లెక్చరర్‌ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో తెలుగు గెస్ట్‌ లెక్చరర్‌ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ నెల 24 సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నియామకం ఉంటుందన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్‌ సంజయ్‌, అధికారులు

శంషాబాద్‌: పట్టణంలోని 19వ వార్డులో సీసీ రోడ్డు పనులను శనివారం అధికారులతో కౌన్సిలర్‌ సంజయ్‌ కుమార్‌ యాదవ్‌ పరిశీలించారు. బురుగుకుంటకు వైపు ఉన్న శ్మశాన వాటిక వరకు వేస్తున్న సీసీ రోడ్డు డీజీ సాజిద్‌, ఏఈ నరేష్‌లు రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని, పనులలో నాణ్యత పాటించాలని సూచించారు. వార్డు పరిధిలో సీసీ రహదారుల పనులు ఒక్కొక్కటిగా పూర్తవుతున్నాయని కౌన్సిలర్‌ సంజయ్‌ అన్నారు.

పార్కులో బోర్‌ వెల్‌ వేయాలని వినతి



ఉప కమిషనర్‌కి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ ప్రధాన కార్యదర్శి విజయకుమార్‌

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్‌కాలనీలో పార్కు అభివృద్ధి కోసం జీహెచ్‌ఎంసీ 30 లక్షల నిధులను పార్కు చుట్టూ ప్రహారి గోడ కోసం మంజూరు చేశారు. ఆ పార్కులో బోర్‌ వెల్‌ వేయాలని కాలనీ ప్రధాన కార్యదర్శి విజయ్‌ కుమార్‌, కాలనీ సలహాదారులు మ్యాకల వెంకటేష్‌ శనివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్కులో బండరాళ్లను తొలగించి వాకింగ్‌ ట్రాక్‌, ఓపెన్‌ జిమ్‌ ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్‌ రవికుమార్‌ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ నుంచి అన్ని విధాల సహకారాలు ఉంటాయని అన్నారు. పార్కుకు కావలసిన నిధులను మంజూరు చేయిస్తానని హామి ఇచ్చారని వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కార్యదర్శి తెలిపారు.

స్కూల్‌లో 'గ్రాండ్‌ పేరెంట్స్‌ డే'



'గ్రాండ్‌ పేరెంట్స్‌ డే'లో పాల్గొన్న తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని గౌతమ్‌ మోడల్‌ స్కూల్‌లో శనివారం 'గ్రాండ్‌ పేరెంట్స్‌ డే'ను నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రతి రోజు తమ మనుమలు, మనమరాళ్లను పాఠశాలకు పంపే తాత, నానమ్మ, అమ్మమ్మలు శనివారం వారితో పాటు పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా వారికి అనేక పోటీలను నిర్వహించగా, వాటిల్లో పాల్గొని రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భరద్వాజ్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లితండ్రులతో పాటు తాత, నానమ్మలతో జీవితంలో ఎంతో నేర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి



హకీంపేట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్‌ అన్నారు. శనివారం నానల్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని టోలిచౌకీ, హకీంపేట్‌, ఎస్‌ఎస్‌ఎఫ్‌ కాలనీ, కాలా బంగ్లా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బుల్కాపూర్‌ నాలాను పరిశీలించారు. నాలాలో పూడికతీత పనులు వెంటనే చేపట్టనున్నామని అన్నారు. గత వారం కురిసిన వర్షాలకు బుల్కాపూర్‌ నాలా పూర్తిగా నిండిందని నాలాలో పూడికలు నిండడం వల్ల నీరు ముందుకు కదలడం లేదన్నారు. అయితే పూడికతీత కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి పనులు చేయిస్తున్నామన్నారు. ఆయన వెంట కార్పొరేటర్‌ నసీరుద్దీన్‌, బల్దియా ఏఈ ఉదయ్‌కుమార్‌ తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి



'స్వచ్ఛతా హీ' ర్యాలీలో కమిషనర్‌ శరత్‌చంద్ర, విద్యార్థులు

బండ్లగూడ: 'స్వచ్ఛతా హీ' సేవా 2024 కార్యక్రమంలో భాగంగా స్వభావ్‌ స్వచ్ఛతా, సంస్కార్‌ స్వచ్ఛతా అనే థీమ్‌తో శనివారం ఉదయం స్వచ్ఛత మారాన్‌ను హైదర్షాకోట్‌లోని ఫర్మాయిషి హోటల్‌ నుంచి వినాయక గుడి వరకు, అటు నుంచి హైదర్షాకోట్‌ ప్రభుత్వ పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ శరత్‌చంద్ర ప్రారంభించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'స్వచ్ఛతా హీ' సేవా కార్యక్రమంలో ప్రజలను, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకొని బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్‌ మంజులత, పాఠశాల హెచ్‌ఎం సైదిరెడ్డి, ఉపాధ్యాయులు, డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్‌, జేఏవో స్వాతిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌, రిసోర్స్‌ పర్సన్స్‌(ఆర్‌పీలు) తదితరులు పాల్గొన్నారు.

టెండర్లను పిలిచి పనులు పూర్తి చేయిస్తా



కమ్యూనిటీహాల్‌ పనులను చేపట్టాలని ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న కార్పొరేటర్‌ శ్రీనాథ్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 5వ డివిజన్‌ సాయిరాం ఎన్‌క్లేవ్‌ కాలనీలో కమ్యూనిటీహాల్‌ నిర్మాణం కోసం 25 లక్షల నిధులు మంజూరైయ్యాయి. వాటి టెండర్‌ ఆలస్యం అవుతుండడంతో స్థానిక కార్పొరేటర్‌ శ్రీనాథ్‌రెడ్డి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి టెండర్లను త్వరగా పిలిపించి పనులను సకాలంలో చేపట్టాలని విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ సానుకూలంగా స్పందించి కమిషనర్‌ శరత్‌చంద్రతో మాట్లాడారు. త్వరగా టెండర్‌ ప్రక్రియ పూర్తి చేసి కమ్యూనిటీహాల్‌ పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ సాగర్‌గౌడ్‌, కాలనీ వాసులు రవీందర్‌నాథ్‌, రాజ్‌కుమార్‌, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల వారిగా ఎస్సీవర్గీకరణ చేపట్టాలి



నివాళులర్పిస్తున్న ఎస్సీకార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ పిడమర్తి రవి తదితరులు

శంషాబాద్‌: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను జిల్లా వారిగా చేపట్టాలని ఎస్సీ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్‌ పిడమర్తి రవి అన్నారు. శనివారం రాత్రి మాదిగ జేఏసీ నాయకుడు గుంటి ప్రవీణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఆయన పట్టణంలోని అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పించి మాదిగ జేఏసీ నాయకులతో మాట్లాడారు. ఉమ్మడి 10 జిల్లాల్లో జనాభా ప్రాతిపదికన మాదిగల రిజర్వేషన్‌ ఉండాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు అమలు చేసేందుకు రాష్ట్ర సర్కారు సమాయత్తం చేయడం హర్షణీయమన్నారు. 30 ఏళ్ల కిందటి ఏడు శాతం అమలు చేస్తే మాత్రం మాదిగలు మరోసారి నష్టపోతారన్నారు. జనాభా ప్రాతిపదికన కేటాయించడమే సముచిత నిర్ణయమన్నారు. ఈ నెల 30 భువనగిరిలో జరిగే మాదిగల మేలుకొలుపు యాత్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మొగులయ్య, వీరేందర్‌, ఉపేందర్‌, సురేష్‌, నరేష్‌, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

గోల్కొండ: పాడి రైతులు రోజురోజుకూ ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని కార్వాన్‌ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్‌కుమార్‌ యాదవ్‌ అన్నారు. శనివారం కార్వాన్‌ శ్రీ కృష్ణ భవన్‌లో కార్వాన్‌ యాదవ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారులను, పాడి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. అన్ని రకాల ఇతర పరిశ్రమలకు ప్రభుత్వం అడగకుండానే ఆర్థిక సహాయంతో పాటు సబ్సిడీలు కూడా అందిస్తుందన్నారు. అయితే నగరంలోని పాల ఉత్పత్తిదారులకు ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు అందించడం లేదని ఆయన అన్నారు. యాదవ సోదరుల వద్ద కనీసం 4–5 గేదెలు ఉంటే అటువంటి వారి ఇళ్లపై కమర్షియల్‌ పేరుతో ఇంటి పన్ను వసూలు చేయడం సబబా అని ఆయన ప్రశ్నించారు. పశువుల వైద్యం కోసం వేలాది రూపాయలు పేద పాడి రైతు వెచ్చిస్తున్నాడని ప్రభుత్వం పరంగా వెటర్నరీ ఆసుపత్రుల నుంచి పాడి గేదెలకు ఎటువంటి వైద్యం అందడం లేదన్నారు. పాడి రైతులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ ఇస్తూ, ఇంటి పన్ను మాఫీ చేయాలని, యంత్రాలు కొనేందుకు సబ్సిడీ అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్వాన్‌ యాదవ సంఘం ప్రధాన కార్యదర్శులు బోని అన్నుయాదవ్‌, జీ.సందేశ్‌యాదవ్‌, వెంకటేష్‌ యాదవ్‌, సుధాకర్‌యాదవ్‌, లక్ష్మణ్‌యాదవ్‌, ఉమాకాంత్‌యాదవ్‌, నాగేష్‌యాదవ్‌, శ్రీనివాస్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

హెచ్‌సీయూ స్కూల్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ సైన్సెస్‌ అండ్‌ టెక్నాలజీ డీన్‌ ప్రొఫెసర్‌ జైప్రకాశ్‌ గౌతమ్‌



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు, విద్యార్థులు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్‌సీయూ స్కూల్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ సైన్సెస్‌ అండ్‌ టెక్నాలజీ డీన్‌ ప్రొఫెసర్‌ జైప్రకాశ్‌ గౌతమ్‌ సూచించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్‌ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో స్కూల్‌ ఆఫ్‌ ఇంజనీరింగ్‌ సైన్సెస్‌ అండ్‌ టెక్నాలజీలో క్లీనప్‌ డ్రైవ్‌ పేరిట స్వచ్ఛత కార్యక్రమం, స్వచ్ఛతా క్విజ్‌ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇల్లు, పనిచేసే కార్యాలయం, చదివే విద్యాసంస్థల్లో, పరిసరాల్లో శుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్‌సీయూ క్యాంపస్‌ను క్లీన్‌ అండ్‌ గ్రీన్‌ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ భీంసింగ్‌ పర్యవేక్షణలో ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు అజయ్‌ప్రకాశ్‌, రాహుల్‌ క్విజ్‌ పోటీలు నిర్వహించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరి ఉన్న జగదాంబిక మహంకాళీ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. శనివారం కోటపై గల అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుండీ లెక్కింపులో అమ్మవారికి రూ.47,050 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పి.శివశంకర్‌, బి.సాయిబాబాచారి, సర్వేష్‌, రాములు తదితరులున్నారు.

వరద బాధితులకు చేయూత

గౌలిపురా: వరద బాధితుల సహాయార్థం గౌలిపురా అయోధ్యనగర్‌లోని జ్ఞాన భారతి పాఠశాలకు చెందిన నర్సరీ నుంచి పదో తరగతి విద్యార్థులు సేకరించిన నోట్‌ బుక్‌లు, పెన్నులు, రబ్బర్లు, పుస్తకాలు, ఇతర వస్తువులను శనివారం సైన్స్‌ అధికారి ధర్మేందర్‌ ద్వారా రెడ్‌ క్రాస్‌ సొసైటీ జిల్లా అధ్యక్షుడు భీమిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

లక్నోకు కార్పొరేటర్ల బృందం



గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ల బృందం లక్నోకు చేరుకుంది. లక్నో మున్సిపల్‌ కార్పొరేషన్‌ వినూత్న రీతిలో చేపట్టిన పనులను పరిశీలించేందుకు మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వెళ్లారు. శేరిలింగంపల్లి సర్కిల్‌ నుంచి గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, శేరిలింగంపల్లి కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌లు లక్నో వెళ్లిన వారిలో ఉన్నారు.

భారీ వర్షం

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి ట్రాఫిక్‌ జామ్‌ ఏర్పడింది. భారీ వర్షం కారణంగా ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత బస్తీలు, కాలనీల్లో వర్షాపు నీరు నిలిచిపోయాయి. అర గంట పాటు కురిసిన భారీ వర్షంలో రోడ్లు పూర్తిగా జలమయంగా మారాయి. వరద నీరు వెళ్లేందుకు జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్‌ పోలీసులు తగిన చర్యలు చేపట్టారు.

నేడు పలు బస్తీల్లో విద్యుత్‌ అంతరాయం

శంషాబాద్‌: పట్టణంలోని పలు బస్తీల్లో ఆదివారం విద్యుత్‌ అంతరాయం ఉంటుందని ఏఈ బాషా ఓ ప్రకటనలో తెలిపారు. శంషాబాద్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని మరమ్మత్తుల కారణంగా మధురానగర్‌, శ్రీనివాసకాలనీ, ఆదర్శనగర్‌, హుడాకాలనీ, సిద్ధాంతి, ఆర్‌బీనగర్‌, కొత్వాల్‌గూడలో ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



షేక్‌ ఖైసర్‌

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన శనివారం భవానీనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వి.నరేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్‌ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన షేక్‌ ఖైసర్‌ (55) గత కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతూ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఈనెల 18న ఖైసర్‌ ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భర్త కనిపించడం లేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ సమస్యను త్వరిత గతిన పూర్తి చేయాలి



బాబుల్‌రెడ్డినగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్‌లో జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ ఉప కమిషనర్‌ రవికుమార్‌తో కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నర్సాబాయి కుంటలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, వర్షం వచ్చినప్పుడు డ్రైనేజీ మ్యాన్‌ హోల్స్‌ నిండి ఇళ్లల్లోకి మురుగు నీరు చేరుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలో కొన్ని సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు ఉన్నాయని, అన్ని గుంతలమయంగా మారాయని, నూతనంగా సీసీ రోడ్లు వేయాలని స్థానిక ప్రజలు కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను త్వరిత గతిన పూర్తి చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. బస్తీలో ఉన్న ప్రతీ సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏదైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ ఈఈ నరేందర్‌ గౌడ్‌, ఏఈ మూర్తి, జలమండలి, విద్యుత్‌ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గణేష్‌ ఉత్సవ కమిటీకి సన్మానం



సన్మాన సభ కార్యక్రమంలో నాయకులు, వివిధ శాఖల అధికారులు

రాజేంద్రనగర్‌: వినాయక సామూహిక నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా విజయవంతంగా జరగడం పట్ల శనివారం డైరీఫామ్‌ వద్దనున్న ఐబీ ఫంక్షన్‌ హాల్‌లో రాజేంద్రనగర్‌ అసెంబ్లీ గణేష్‌ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అధికారులతో ఉత్సవ కమిటీ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌, డీసీ రవి కుమార్‌, సైబరాబాద్‌ గణేష్‌ ఉత్సవ కన్వీనర్‌ బద్దం మహిపాల్‌ రెడ్డి, రాజేంద్రనగర్‌ అసెంబ్లీ కన్వీనర్‌ శ్రీధర్‌, జాయింట్‌ కన్వీనర్‌ బొక్క బాల్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్‌ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్‌ మల్లేష్‌ యాదవ్‌, ఏసీపీ శ్రీనివాస్‌, ట్రాఫిక్‌ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్‌ క్యాస్ట్రో, మైలార్‌దేవ్‌పల్లి సీఐ, ఆర్‌అండ్‌బీ డీఈ పూనమ్‌, డీజీఎం జోహర్‌, సత్యనారాయణ, రాజేంద్రనగర్‌ డివిజన్‌ అధ్యక్షులు బాబురావు, అత్తాపూర్‌ డివిజన్‌ అధ్యక్షులు విజయ్‌ కుమార్‌, ఎస్టీ మోర్చా అధ్యక్షులు ప్రకాష్‌, వేణుగోపాల్‌, రఘుమారెడ్డి, జంగయ్య, స్వామి, శశి, మల్లేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ బలోపేతానికి సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్‌ సాయిబాబా

రాయదుర్గం: శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని బీఆర్‌ఎస్‌ పార్టీ సీనియర్‌నాయకుడు, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్‌ కొమిరిశెట్టి సాయిబాబా స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన బీఆర్‌ఎస్‌భవన్‌లో మాజీ మంత్రి తారకరామారావు సమక్షంలో శేరిలింగంపల్లి ముఖ్య నాయకుల సమావేశాన్ని జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో డివిజన్ల వారీగా పార్టీని పటిష్టం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ మాధవరం రంగారావు,సీనియర్‌ నాయకులు రవియాదవ్‌, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, శేఖర్‌గౌడ్‌, రామకృష్ణగౌడ్‌, చెన్నంరాజు, బాబుమియా, విజయలక్ష్మి, జమీర్‌, రాగం జంగయ్యయాదవ్‌, అంజమ్మసతీష్‌, రాజు, తిరుమలేష్‌, అనిల్‌సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

గోల్కొండ: మహిళలు ఆర్థికంగా బలపడితేనే ఆ కుటుంబాలు నిలబడగలుగుతాయని ఉమ్మడి రాష్ట్ర మాజీ మహిళా కమిషన్‌ చైర్మన్‌ అయేషాబేగం అన్నారు. మహిళా పొదుపు సంఘాల ఏర్పాటుపై శనివారం ఆమె పీస్‌ ఫోర్స్‌ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్‌ నజీబ్‌తో సమావేశం అయ్యారు. టోలిచౌకీలోని పీస్‌ ఫోర్స్‌ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పొదుపు సంఘాల ఏర్పాటు కోసం మహిళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా స్వయం ఉపాధి కోసం ముందుకు వచ్చే మహిళలు, మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాయన్నారు.

గంగపుత్ర సొసైటీ చెరువులను పరిరక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న గంగపుత్ర సంఘం ప్రతినిధులు

గోల్కొండ: కార్వాన్‌ సబ్జి మండలి ప్రాథమిక మత్స్య సహకార సంఘానికి రాజేంద్రనగర్‌ పరిధిలో చెరువులు, కుంటలతో పాటు ఉస్మాన్‌సాగర్‌ దిగువ ప్రాంతాన నుంచి పురానాపూల్‌ వరకు చేపలు పట్టేందుకు అన్ని రకాల హక్కులు ఉన్నాయని ఈ చెరువులు, కుంటలను పరిరక్షించాలని సబ్జిమండీ మత్స్య సహకార సంఘం వారు కోరారు. శనివారం తెలంగాణ ఫిషర్‌మెన్‌ కోఆపరేటివ్‌ సొసైటీస్‌ ఫెడరేషన్‌ చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం హైడ్రా కమిషనర్‌ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రాజేంద్రనగర్‌ పరిధిలోని చెరువులు, కుంటలు ప్రేస్టేజ్‌ గ్రూప్‌ సంస్థ వారు కబ్జా చేశారని గంగపుత్ర సోదరులకు వాటిలో చేపలు పట్టడానికి అనుమతించడం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రాథమిక సంఘం అధ్యక్షుడు కట్ట లింగం, ప్రధాన కార్యదర్శి మురారీ రాంబాబు తదితరులున్నారు.